## కాలమ్ జీవిత కథ

### సంశయం తొలగింది

ఆరుగురు ఆడపిల్లలకు పెళ్ళి చేశాము. పెద్ద పరుగులకు పోకుండా, ఎవరో మంచి అయ్యలు దొరికితే చాలునని సంబంధాలు కుదిర్చాము. అందరూ బాగున్నారు. పిల్లా, పాపలను కన్నారు. అన్నీ బాగానే ఉన్నాయి. ఇంతలో ఉన్న ఒక్క మగపిల్లడు చదువు పూర్తిచేసి ఉద్యోగంలో ప్రవేశించి రెండేళ్ళయింది. ఇంకా మరో ఆడపిల్ల పెళ్ళికి మిగిలినా, కోడలి గురించి వెదుక్కోవలసి వచ్చింది. చాలామంది ఆడపిల్లల తండ్రులు వెంటబడ్డారు. ఒకరోజు రమారమి అయిదు సంబంధాలు చూసాము. ఎవరూ నచ్చలేదు. కాని ఆ సాయంకాలమే మరొకరు వచ్చారు. పిల్లను చూసుకోవడం, నచ్చుకోవడం,



పెళ్ళి అవడం అన్నీ తొందర తొందరగా జరిగిపోయాయి. అల్లుళ్ళు ఎటువంటి వాళ్ళు దొరుకుతారని ఎప్పుడూ ఆలోచించలేదు. కాని, కోడలు వచ్చిన తరువాత చిన్న సందేహం పట్టుకుంది. అత్త మామలను ఆ పిల్ల బాగా చూడవచ్చు-మర్యాదస్తుల కుటుంబం-ఆడపిల్లలు పుట్టింటికి వస్తే కోడలు చూస్తుందా?

ఇంట్లో ఏదో కార్యమయింది. ఆడపిల్లలు వచ్చారు. కోడలు కూడా ఉంది. ఆవేళ సాయంకాలం నూతి దగ్గిర కోడలు బట్టలు ఉతుకుతున్నది. పగలల్లా పనిచేసి బట్టలెందుకు ఉతుకుతున్నావని ఆమెను అడిగాను.

"పెద్ద వదినకు తలనొప్పిగా ఉంది. ఆమె ఉతుక్కుంటుంటే నేనే వద్దని ఉతుకుతున్నాను." అంది మా కోడలు.

కళ్ళంట నాకు రెండు వేడి కన్నీటిబొట్లు రాలాయి.

నా సంశయం తొలగిపోయింది. మాకోడలు మంచిది.

ఘండికోట సీతారామ

---

ఇద్దర్నీ వెంబడించేను నేను! ఆళ్లిద్దరు హొటేల్లో పై అంతస్తులో దిగేరు. ఆ రాత్రి... ఒంటిగంటకి దాన్ని సఫా చేద్దామని ఎల్లేసరికి అవతల్ది అప్పటికే దీని డబ్బూ, దస్కం తీసుకొని వుడాయించేసింది! ఇదొక్కర్తే నాసేతికి వీజీగా సిక్కిపోయింది! పడుకున్న దాన్ని పడుకున్నట్టే పొడిసేసి...గోతాంలో సుట్టి సముద్రంలోకి యిసిరేసేను!" అన్నాడు అప్పలకొండ ధీమాగా.

"మరి... ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు?"

"ఆ పోలీస్ టేసన్ కాడే వున్నాను!"

"ఆ " అంటూ ఆశ్చర్యపోయేడు మదన్.

అవును బాబూ! ఈ కేసెవ్వారం ఎట్టా తేలుద్దో సూద్దామని టేసన్ కాడే ఏర్సెనక్కాయలమ్ముతూ, పోలీసోళ్ళని యివరాలడుగుతూ కూసున్నాను! ఇదంతా మొత్తం ఆ ఆడదాని మీనకి పోయిందని తెలిసేక ఇటొచ్చేను!" అన్నాడు అప్పలకొండ తాపీగా.

మదన్ లేచి నిలబడి "భేష్!" అంటూ అప్పలకొండ వీపు చరిచేడు.

ఆ వెంటనే లోపలికెళ్ళి డబ్బుతీసుకొచ్చి అప్పలకొండ చేతిలో పెడుతూ "లెక్క చూసుకో!" అన్నాడు.

'తమకాడ లెక్కేటండి బాబయ్యా!' అంటూనే లెక్కచూసుకున్నాడు అప్పలకొండ.

"మరో అయిదెక్కువున్నాయి!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును! ఒప్పుకున్నది పాతికవేలయినా నీ చాకచక్యానికి మెచ్చి మరో అయిదిచ్చేను. ఏదేనా వ్యాపారం చేసుకో!" అన్నాడు మదన్ మెచ్చుకోలుగా.

"ఇంకో యాపారం నాకేటొస్తాది బాబూ ఈ కత్తి పని తప్ప! మళ్లీ గిరాకి తగిల్తే కబురు సెయ్యండి! ముంజెల్ని తాటికాయలోంచి ఒలిచినట్టు ఒలిసేస్తాను నాయాళ్ళ పేనాల్ని!" అంటూ సవాల్ చేసేడు అప్పలకొండ.

"అలాగేలే! ప్రస్తుతానికి వెళ్ళు! మందు తాగిన నిషాలో ఒళ్ళు తెలియక వాగేవ్ కనుక! నీ ప్రాణాలు ఒలిచేయడానికి మరొకడు రావాల్సి వస్తుంది!" అన్నాడు మదన్ హెచ్చరికగా.

అప్పలకొండ తప్పన్నట్టుగా ముక్కుకి వ్రేలడ్డం వుంచుకుని తల తాటించి వెళ్ళిపోయేడు "వస్తాను దొరా!" అంటూ.

## 12

మీ తమ్ముణ్ణి కదిపి చూసేరా?" అంది భర్తకి కాఫీ అందిస్తూ సావిత్రి.

"ఏ సంగతి?" అన్నాడు భాస్కర్రావు పరాకుగా.

సావిత్రి మూతి తిప్పింది "పె...ద్ద బడాయి! నా దగ్గరే మగపెళ్ళివారి ఫోజు చూపిస్తున్నారా?" అంది కోపం నటిస్తూ.

"నిజంగానే సావీ! నువ్వే సంగతి చెప్పావో నాకు గుర్తు లేదుస్మీ! మరోసారి చెబితే నీ సొమ్మేం పోతుంది!" అన్నాడు భాస్కర్రావు నవ్వుతూ.

సావిత్రి నవ్వింది.

"మీ సంగతి నాకు తెలియన్దేముంది? అదే మన వాసంతి పెళ్ళి విషయం! రవీంద్రకిచ్చి దాన్ని ముడిపెట్టాలని మా కోరిక! అంతేకాక వాసంతి కూడ రవీంద్రంటే మోజు చూపిస్తోంది! అతనొచ్చిందగ్గర్నుండీ దీని కాళ్ళు భూమికి జానెడెత్తున తేలుతున్నాయి! బావ, బావంటూ సరదాపడి పోతున్నది! అందుకే... ఆ కాస్త శుభకార్యం జరిపించేయాలని... నాకు ఆరాటంగా వుంది!" అంది సావిత్రి ఆత్రుతగా భర్త ముఖంలోకి చూస్తూ.

భాస్కర్రావు భార్య ముఖంలోకి చూసి నవ్వి "అమ్మో ఆడపిల్ల తల్లిలా మాట్లాడేవు!" అన్నాడు.

"అవును! మనకి ఎలాగూ పిల్లలు లేరు! ఇటు వాసంతిని అటు రవీంద్రని నా పిల్లలుగానే భావించేను! నేను కాపరానికి వచ్చేటప్పటికి రవీంద్ర ముక్కు చీమిడన్నా తుడుచుకోవడం రాని పసివాడు! ఆ రోజుల్లోనే ఆ వయసులోనే అతనికి తల్లిలేదన్న విషయం నన్నెంతో బాధపెట్టింది! ఆ నాటి నుండి అతన్ని నా కొడుకులానే భావించేను! ఏదో ఈ చదువుల నెపంతో అతను ఈ అయిదారేళ్ళుగా దూరంగా వున్నాడు కాని... నా మనసులోంచి దూరం కాలేదుగా!" అంది సావిత్రి.

అలా చెబుతొన్నప్పుడు ఆమె కళ్ళలో సన్నటి నీటిపొర మెరిసింది.

భాస్కర్రావు భార్య ముఖంలోకి చూసి ముద్దుగా ఆమె బుగ్గమీద తట్టి "పిచ్చీ, దానికే యింత యిదవ్వాలా? రవిని నువ్వెలా ప్రేమించిందీ నాకు తెలియని విషయమా! రవి ఖచ్చితంగా ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడు! నా మీద గౌరవం కన్నా నీ మీద వున్న ప్రేమే అతన్ని జయిస్తుంది. పైగా వాసంతికి మాత్రం ఏం లోటు! గాలి నింపిన రబ్బరు బొమ్మలా గుమ్మటంలా వుంటుంది!" అన్నాడు.

"చాల్లెండి మాటలు బాగా నేర్చేరు! ఇప్పుడలానే అంటారు. ఆ రెండో పెళ్ళాం దగ్గర కెళ్ళేరంటే సర్వం మరచిపోయి... రేపు మొదటి కొస్తారు! అప్పుడే ఇది నేనెన్నోసారి చెప్పడం!" అంది సావిత్రి.

అప్పుడే సరిగ్గా రవీంద్ర లోపలి కొచ్చేడు.

"ఏంటొదినా! ప్రొద్దున్నే అన్నయ్యని రేగుపళ్ళ చెట్టుని దులిపినట్టు దులిపేస్తున్నావు!" అన్నాడు నవ్వుతూ అన్నగారి ఎదుట కూర్చున్నాడు.

"అవున్నాయనా, మీ అన్నయ్య చేసే నిర్వాకాలు కనిపించేవు! ఎవరికయినా నా నోరు వినిపిస్తుంది! ఎంతయినా మీరూ మీరూ ఒకటేగా!" అంది సావిత్రి ఉత్తిత్తి కోపం నటిస్తూ.

"నువ్వలా మాట్లాడక పోతే ఈ యింటికి అందమేముంది వదినా! నీవలనే కదూ ఈ యింటికి జీవం!" అన్నాడు రవీంద్ర.

"మాటల్లో అన్నగారికేం తీసిపోవు!" అంది సావిత్రి నవ్వుతూ.

"అద్సరే! ఉద్యోగమెలా వుంది? ఆ ఇ.ఇ.తో ఏం యిబ్బందులూ లేవుగా!

ఆయనకి చండశాసనుడనే పేరుంది!" అంటూ ఉద్యోగ వివరాలడిగేడు భాస్కర్రావు తమ్ముణ్ణి.

"అదేం లేదు నన్ను బాగానే ట్రీట్ చేస్తున్నాడు!" అన్నాడు రవీంద్ర.

"నీ పుణ్యం పుచ్చింది! నీకు ముందు రమణ